క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి బుగ్గన


బేతంచెర్ల ఎంపీపీ స్కూల్ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంలోని 271 పోలింగ్ బూత్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు కల్పించిన వసతులపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మంత్రి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఓటు వేశారు.

ఎమ్మెల్యే కాటసాని...


ఓటు వేసిన సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కుటుంబ సభ్యులు బనగానపల్లె పట్టణం ఎంపీపీ కస్బా పాఠశాలలోని 97వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, కోడలు కాటసాని మేధాశ్రీరెడ్డి ఓటు వేశారు.

జెడ్పీ చైర్మన్...



కొలిమిగుండ్ల: జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి స్వగ్రామం నాయినపల్లెలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒకటి రెండు చోట్ల ఈవీఎంలు కొద్ది సేపు మొరాయించినా యథావిధిగా పని చేశాయి. ఓటింగ్ సరళిపై జెడ్పీ చైర్మన్ ఆరా తీశారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎంపీ పోచా


కలుగొట్లలో పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని గుళ్లదూర్తి, కోవెలకుంట్ల, కలుగొట్ల, రేవనూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు. ఎంపీ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, రాజారెడ్డి, ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, మల్లు హరినాథరెడ్డి, సురేంద్రారెడ్డి, డాక్టర్ రామేశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

రెచ్చిపోయిన టీడీపీ నాయకులు


ప్యాపిలి పోలీసులతో వాగ్వాదానికి దిగిన మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి

డోన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు జరగాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమ్యమనం పాటిస్తుంటే టీడీపీ నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అడుగడుగునా వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను, వైఎస్సార్‌సీపీ నాయకులను బెదిరిస్తూ వచ్చారు. పోలింగ్ ముగిశాక మీ కథ ముగిస్తానంటూ ఒక మహిళా కౌన్సిలర్, ఆమె భర్తను నారాయణ స్కూల్ వద్ద అందరి ఎదుటనే కోట్ల సుజాతమ్మ వేలెత్తి చూపిస్తూ బెదిరించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెను చూసి మొఖం చాటేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మార్కెట్‌యార్డు చైర్మన్ వితండవాదన

ప్యాపిలి పట్టణంలోని ఒక పోలింగ్ బూత్ వద్ద ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణ మూర్తి బహిరంగంగానే ఓటర్లను ప్రలోభపెడుతూ పోలిసుల కంటపడ్డారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ జగదీశ్వర రెడ్డి ఆయన్ను వారించడంతో వాగ్వివాదానికి దిగాడు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించకూడదని, దూరంగా వెళ్లాలని కోరినా కూడా ఆయన పోలిసులను ఏ మాత్రం లెక్కచేయకుండా అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలిసింది. కొంతమంది పోలిసుల జోక్యంతో సద్దుమనిగినా గొడవను మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తిరిగి లేవనెత్తి శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.


కూతురుతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వస్తున్న వృద్ధురాలు


బేతంచెర్ల పట్టణంలో బారులు తీరిన ఓటర్లు


ఆర్ఎస్ రంగాపురంలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు

పోటెత్తిన ఓటర్లు!


ఉదయం 9గంటలకు సాయిశ్రీ డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

- వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైన పోలింగ్
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు.. తరలివచ్చిన వృద్ధులు

డోన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ డోన్ నియోజకవర్గంలో సోమవారం రెండు స్వల్ప సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవ్వగా తెల్లవారుజామున 4గంటల నుంచి మూడుగంటల పాటు వర్షం కురవడంతో పోలింగ్ ఉదయం 9గంటల వరకు మందకొండిగా సాగింది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి నియోజకవర్గం వ్యాప్తంగా 81శాతం పోలింగ్ నమోదైందని రిటర్నింగ్ అధికారి మహేశ్వర రెడ్డి తెలిపారు. ఉదయం వర్షం మూలంగా పోలింగ్ కేంద్రాలకు జనం చేరుకోకపోవడంతో ఉదయం 9గంటల వరకు క్యూలో ఓటర్లు లేక ఆయా పోలింగ్ కేంద్రాలు ఖాళీగా కనిపించాయి. 9గంటల తర్వాత క్యూలైన్లో ఓటర్లు పెరగడంతో ఓటింగ్ శాతం కూడా క్రమేపి పెరుగుతూ వచ్చింది. పది గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.

డోన్ నియోజకవర్గంలో మొత్తం 227351 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,11,883, స్త్రీలు 1,15,398, ఇతరులు 70మంది ఉన్నారు. మధ్యాహ్నం 12గంటలకు పోలింగ్ శాతం 26.43 ఉండగా 2గంటలకు 48.98శాతానికి పెరిగింది. 4గంటలకు 63.10శాతం ఉండగా 6గంటలకు 79.02శాతానికి చేరుకొంది. మల్లెంపల్లె, మల్కాపురం తదితర గ్రామాల్లో ఉదయం ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. దీంతో సాయంత్రం 6గంటలకు పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు బారులుతీరారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మంత్రి బుగ్గన

బేతంచెర్ల: డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండల్లాలో పోలింగ్ కేంద్రాలను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం పరిశీలించారు. మండల కేంద్రం బేతంచెర్లతోపాటు రుద్రవరం, మండ్లవానిపల్లె, యంబాయి, పేండేకల్లు, హెచ్ కొట్టాల తదితర గ్రామాల్లో పోలింగ్ సరళిని మంత్రి బుగ్గన పరిశీలించారు. డోన్ మండలంలోని చిన్న మల్కాపురం, డోన్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మంత్రి పరిశీలించారు. ప్యాపిలి పట్టణంలోని జలదుర్గం గ్రామంలోనూ పోలింగ్ తీరును మంత్రి బుగ్గన పరిశీలించారు.

మొరాయించిన ఈవీఎంలు

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 6:30 గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకున్నారు. బేతంచెర్ల పట్టణ పరిధిలోని 270, 271, 272 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లకు అరగంటపాటు నిరీక్షణ తప్పలేదు. అదేవిధంగా గోరుమానుకొండ గ్రామాలో ఒక ఈవీఏం గంట పాటు మొరాయించింది.

ప్యాపిలిలో ప్రశాంతంగా పోలింగ్


జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకొని వస్తున్న వృద్ధురాలు

ప్యాపిలి: ప్యాపిలి మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 56,712 మంది ఓటర్లు ఉండగా వారిలో 28,469 మంది పురుషులు కాగా, 28,241 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 81 బూత్‌లలో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


నల్లమేకలపల్లిలో ఓటు వేసిన విభిన్న ప్రతిభావంతుడు


ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్న శతాధిక వృద్ధురాలు


బేతంచర్లలో ఓటు వేసేందుకు పసిబిడ్డతో వస్తున్న మహిళ

ప్రలోభాలను అడ్డుకున్న ఎస్ఐ

ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్న తరుణంలో టీడీపీ నాయకులు ఓటర్లకు ప్రలోభాలకు గురి చేసేందుకు యత్నించారు. డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణ మూర్తి పోలింగ్ కేంద్రం సమీపంలో ఓటర్లకు డబ్బులు పంచుతూ సైకిల్‌కి ఓటేయాలని ప్రలోభాలకు యత్నించాడు. గమనించిన ప్యాపిలి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ప్రలోభాలకు గురిచేస్తున్న రాజా నారాయణమూర్తిని అడ్డుకున్నారు.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. పెద్దపొదిళ్ల, జలదుర్గం, అలేబాదు, అలేబాదుతండాల్లో సాయంత్రం 6 గంటలైనా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్లో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం ఇవ్వడంతో ఆయా గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. అలేబాదు, జలదుర్గం, అలేబాదు తండాల్లో రాత్రి 7-30 గంటలకు పోలింగ్ ముగిసింది. పెద్దపొదిళ్లలో రాత్రి 8 గంటలకు పోలింగ్ ముగిసినట్లుఅధికారులు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థి పీఎన్ బాబు ఓవరాక్షన్!

నంద్యాల: స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పీఎన్ బాబు పోలింగ్ సందర్భంగా ఓవరాక్షన్ చేశాడు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ కొలుముల పల్లె నుంచి మండల కేంద్రం బేతంచెర్లకు బయలుదేరారు. అయితే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పీఎన్ బాబు మంత్రి వాహనాన్ని ఓ విధంగా వెంబడించినట్లు అనుసరించారు. చివరకు పట్టణం చేరుకున్నాక ఎందుకు నా వెంటే వస్తున్నావంటూ మంత్రి పీఎస్ బాబును ప్రశ్నించగా దురుసగా సమాధానమిచ్చారు. ఇది మీ రోడ్డా... నేను కూడా స్వతంత్ర అభ్యర్థిని... రిటైర్డ్ డీఎస్పీని కూడా అంటూ పీఎన్ బాబు దురుసుగా మాట్లాడారు. దీంతో మంత్రి అనుచరులు, పీఎన్ బాబు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే మంత్రి బుగ్గనే తనను దుర్భాషలాడాడని, కులం పేరుతో దూషించాడని పీఎస్ బాబు దుష్ప్రచారం ప్రారంభించారు.

మంత్రిపై పీఎస్ బాబు దుష్ప్రచారం....

సీఐ జోక్యంతో వ్యవహారం సద్దుమణగగా పీఎస్ బాబు దుష్ప్రచారానికి తెరలేపాడు. మంత్రి తనపై దుర్భాషలాడాని, కులం పేరుతో దూషించాడని దుష్ప్రచారం ముమ్మరంగా చేపట్టాడు పీఎస్ బాబు. డీఎస్పీగా రిటైర్డ్ అయిన పీఎస్ బాబు తన పోలీసు శైలిని ప్రదర్శించారు. మంత్రికి కనీసం గౌరవం ఇవ్వకుండా వ్యహరించిన పీఎస్ బాబు ఉద్దేశపూర్వకంగానే అసత్యారోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీ నాయకులు ఖండించారు. టీడీపీకి పీఎస్ బాబు మద్దతుదారుడే అనే ప్రచారం కూడా ఉంది. ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఆయన ప్రత్యక్షంగానో... పరోక్షంగానో టీడీపీ అభ్యర్థి, మాజీ కేంద్ర సహాయ మంత్రి కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డికి మేలు చేకూర్చేందుకే కుట్రలు పన్నుతున్నారనే విమర్శలు లేకపోలేదు. వాగ్వాదం జరిగిన సందర్భాన కూడా పీఎస్ బాబు పక్కన టీడీపీ నాయకులే ఉండడం ఈ విమర్శలకు బలం చేకూర్చుతున్నాయి.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఉదయ 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లు
- బారులు తీరిన మహిళలు, వృద్ధులు

బనగానపల్లె : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభవ్వగా ఓటర్లు 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెతోపాటు కోవెంటకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో ఓటేసేందుకు ప్రజలను బారులు తీరారు. నియోజకవర్గంలో మొత్తం 277 పోలింగ్ కేంద్రాలు ఉండగా సాయంత్రం ఆరుగంటలకు 73 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కొనసాగింది. బనగానపల్లె పట్టణంలోని 113వ బూత్‌లో ఎక్కువగా 1,443 మంది ఓటర్ల ఉండగా అతితక్కువగా నిలువుగండ్ల గ్రామంలో 161వ బూత్‌లో 145 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె నియోజకవర్గంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, కోడలు మేధాశ్రీరెడ్డితోపాటు ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి విడివిడిగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో పాటు ఏజంట్లతో మాట్లాడి ఓటింగ్ సరళిపై ఆరా తీశారు.

కొలిమిగుండ్ల: ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో అంతకు ముందుగానే ఓటర్లు బూత్‌ల వద్ద క్యూలైన్లలో నిల్చున్నారు. మండల వ్యాప్తంగా 78 శాతం పోలింగ్ నమోదైంది. తహసీల్దార్ సునీతబాయి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

అవుకు: అవుకు మండలంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని 50 పోలింగ్ కేంద్రాలు ఉదయం నుంచే ఓటర్లతో కిక్కిరిశాయి. కొండమనాయునిపల్లెలో బూత్ నంబరు.11లో ఈవిఎం సమస్య వచ్చి కొద్ది నిమిషాల పాటు అంతరాయం కలిగిన టెక్నీషియన్స్ జోక్యం చేసుకొని సమస్యను సర్దుబాటు చేశారు. రామవరంలో వృద్ధురాలితో ఓటు వేయించే విషయంలో రెండు వర్గాల ఏజెంట్ల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకోవటంతో ఈవీఎంను తోసేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని రెండు వర్గాల ఏజెంట్లను మందలించారు.


బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


బనగానపల్లెలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబులరెడ్డి, కోడలు మేధాశ్రీరెడ్డి


కలుగొట్లలో సాయంత్రం 6 గంటలు దాటినా ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఓటెత్తిన చైతన్యం

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం బనగానపల్లె నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. కోవెలకుంట్ల మండలంలోని బిజనవేముల పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఒక ఈవీఎం పనిచేయలేదు. మరో ఈవీఎం ఏర్పాటు చేశారు. అలాగే కోవెలకుంట్ల పట్టణంలోని 242వ పోలింగ్‌బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడింది. తర్వాత అధికారులు సరిచేశారు. కలుగొట్లలో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఈవీఎంలు సరిగా పనిచేయకపోవడంతో పోలింగ్ సమయం ముగిసే సమయానికి 400 మంది ఓటర్లు క్యూలో ఉండటంతో అధికారులు వారికి టోకన్లు పంపిణీ చేశారు. మండలంలోని అమడాల, సొదరదిన్నె గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు వేసేందుకు భారీగా తరలి రావడంతో ఆయా గ్రామాల్లో 85 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. కోవెలకుంట్ల పట్టణంతోపాటు భీమునిపాడు, అమడాల, సొదరదిన్నె గ్రామాల్లో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో కొంతసేపు పోలింగ్‌కు అంతరాయం కల్గింది. తర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో పోలింగ్ యధావిధిగా కొనసాగింది. మండలంలోని 45 పోలింగ్ బూతుల్లో 77 శాతం ఓట్లు పోలయ్యాయి.


కలుగొట్లలో ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు

గ్రామాల్లో గణనీయంగా పెరిగిన పోలింగ్:

ఎన్నికల పోలింగ్ గ్రామీణ ప్రాంతాల్లో గణనీయంగా పెరిగింది. మండలంలోని వెలగటూరులో అత్యధికంగా 96శాతం, లింగాలలో 95, చిన్నకొప్పెర్లలో 94.3, వల్లంపాడులో 93, పెద్దకొప్పెర్లలో 92, రేవనూరులో 90, గుళ్లదూర్తిలో 89.7, కంపమల్లలో 89, బిజనవేములలో 87శాతం, భీమునిపాడులో 85.6, అమడాలలో 77 శాతం ఓట్లు పోలయ్యాయి.


పేరుసోములలో ఓటేసేందుకు తరలివచ్చిన ఓటర్లు


చింతలాయిపల్లెలో బారులు తీరిన మహిళా ఓటర్లు


బనగానపల్లె ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో క్యూకట్టిన ఓటర్లు


పలుకూరులో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు


తిమ్మనాయినపేట సమీపంలో పొలంలో నిలిచిన వర్షపునీరు


బేతంచెర్ల పట్టణంలో కురుస్తున్న వర్షం

కుండపోత !

కొలిమిగుండ్ల: మండలంలో సోమవారం తెల్లవారు జామున కుండపోతగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో బీభత్సం సృష్టించింది. ఏకధాటిగా గంటకు పైగానే వర్షం కురిసింది. మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినపేట, చింతలాయిపల్లె, అబ్దులాపురం తదితర గ్రామాల్లో జోరుగా వర్షం కురిసింది. పొలాల్లో వర్షపు నీరు నిల్వ చేరాయి. ఆయా గ్రామాల్లోని వీధుల్లో వర్షపునీరు ప్రవహించాయి. దాదాపు ఎనిమిది నెలల తర్వాత ఈస్థాయి వర్షపాతం నమోదు అయ్యింది. వర్షం రాకతో వాతావరణం చల్లబడింది.

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లతో వర్షం కురిసింది. వృక్షాలకు ఉన్న కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునురుద్ధరణ పనులు చేపట్టారు.